సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



నిధులు విడుదల చేయాలి

జిల్లాలోని పలు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఆలయాలకు నిధులు విడుదల చేయాలని ఆలయాల కమిటీ సభ్యులు కోరారు. 8లో



ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

వచ్చేనెల 10న సింహగిరిపై ముక్కోటి ఏకాదశి ఉత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయనున్నట్టుఈవో తెలిపారు. 8లో

సిరులతల్లికి పూజలు



మార్గశిర మాసోత్సవాల 15వ రోజు సోమవారం బురుజుపేటలో కొలువైన కనక మహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని, పూజలు చేశారు. 8లో

న్యూస్‌రీల్

19న పాడేరులో జాబ్‌మేళా

పాడేరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా ఈ నెల 19న పాడేరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ రోహిణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిగే ఈ జాబ్‌మేళాలో రుద్ర కో ఆపరేటివ్ సర్వీసెస్, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. 18 ఏళ్ల నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఆపైన విద్యార్హత ఉన్న నిరుద్యోగ యువతీయువకులు పాన్‌కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జెరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని తెలిపారు. ఎంపికైన వారికి ఉద్యోగావకాశం కల్పించి, నెలకు రూ.10వేల నుంచి రూ.15 వేల వేతనం అందజేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 6302636174, 9398338105 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

నేడు, రేపు ఏకసభ్య కమిషన్ పర్యటన

పాడేరు: ఎస్సీ వర్గీకరణపై నియమించిన ఏకసభ్య కమిషన్ సభ్యుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఈనెల 17,18 తేదీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ దినేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికార యంత్రాంగం, వివిధ ఉపకులాల సభ్యులు, సంఘాలతో సమావేశమై వినతి పత్రాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. షెడ్యూల్ కులాల్లో వివిధ ఉప వర్గాలు, సామాజిక, ఆర్థిక, విద్యా పరంగా ఉన్న లోటుపాట్లను పరిశీలిస్తారని తెలిపారు. కమిషన్‌కు వినతి పత్రాలు అందించాలనుకునేవారు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 18వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

వామ్మో.. చలి పులి

జిల్లాలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

- జి.మాడుగులలో 4.1, అరుకులోయలో 4.8 డిగ్రీలు నమోదు
- చలిగాలులు, మంచుతో అవస్థలు పడుతున్న ప్రజలు



లంబసింగిలో దట్టంగా కురుస్తున్న మంచు, (ఇన్‌సెట్) పాడేరులో కురుస్తున్న పొగమంచు



రాజవొమ్మంగిలో చలితోనే రోజువారీ పనులు చేస్తున్న గిరిజన మహిళ

సాక్షి, పాడేరు/చింతపల్లి: జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. సాయంత్రం 4 గంటల నుంచే చలిగాలులు విజృంభిస్తున్నాయి. రాత్రి వేళల్లో చలిపులి మరింత వణికిస్తోంది. మరోవైపు పొగ మంచు కూడా దట్టంగా కురుస్తోంది. ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. అల్పపీడన ప్రభావంతో వారం కిందట ఉష్ణోగ్రతలు పెరిగినప్పటికీ నాలుగు రోజులుగా మళ్లీ తగ్గుముఖం పట్టి సింగిల్ డిజిట్‌కు చేరుకున్నాయి. సోమవారం జి.మాడుగులలో 4.1 డిగ్రీ, అరుకులోయలో 4.8 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, ఉష్ణోగ్రతలు విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలో చింతపల్లిలో 7.0, జీకే వీధిలో 7.3, హుకుంపేటలో 7.8, పెదబయలులో 9.0, అనంతగిరిలో 9.4, కొయ్యూరులో 11.6డిగ్రీలు చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఏడీఆర్ తెలిపారు. గత వారం వరకూ కనిష్ట ఉష్ణోగ్రతలు స్థిరంగా ఉన్నప్పటికీ గడిచిన నాలుగు రోజులుగా తగ్గుతుండడంతో చలి తీవ్రతతో మన్యం వాసులు వణికి పోతున్నారు. ఉన్ని దుస్తులు లేకుండా బయట తిరగలేకుండా పోతున్నారు. సాయంత్రం వేళల్లో చలి మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. లైట్లు వేసుకుని వాహనాలను నడపాల్సిన పరిస్థితి. మరో వైపు పాఠశాలలకు వెళ్లే చిన్నారులు కూడా చలిపులితో అవస్థలుపడుతున్నారు. వ్యవసాయ పనులు వారపుసంతకు వెళ్లే గిరిజనులు పొగ మంచు, చలిగాలి తీవ్రతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్ని దుస్తులు లేకుండా బయటకు రాలేకపోతున్నారు. ఏజెన్సీని సందర్శించే పర్యాటకులు కూడా చలితో చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. చలిగాలులు విజృంభిస్తుండడంతో తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మరోవైపు ఉన్ని దుస్తులు అమ్మకాలు పెరిగాయి.

మంచుతో ఉక్కిరిబిక్కిరి

రాజవొమ్మంగి: మండలంలో దట్టంగా కమ్ముకొంటున్న మంచు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సోమవారం వాతావరణం మంచు తుఫాన్‌ను తలపించింది. అసలే చలి, ఆపై మంచు తోడు కావడంతో పొలం పనులకు, ఇతర దైనందిన కార్యక్రమాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పూరి గుడిసెల్లో నివశించే వారు చలికి తాళలేక అవస్థలకు గురవుతున్నారు.



పాడేరులో చలిమంటలు కాగుతున్న యువకులు

అథ్లెటిక్స్‌లో మెరిసిన గిరిజన క్రీడాకారుడు

- వరుగు పోటీల్లో మూడు వెండి పతకాలు



రాష్ట్ర మాస్టర్స్ అసోసియేషన్ సెక్రటరీ వరప్రసాద్ చేతుల మీదగా వెండి పతకం అందుకుంటున్న ప్రసాద్

ముంచంగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీ జర్రిపడ గ్రామానికి చెందిన గిరిజన క్రీడాకారుడు కుర్తాడి ప్రసాద్ అథ్లెటిక్స్‌లో మెరిశారు. 14,15 తేదీల్లో కృష్ణా జిల్లా గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన 44వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాస్టర్స్ వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ చాంపియన్ షిప్–2024 పరుగు పోటీల్లో జిల్లా నుంచి పాల్గొన్న కుర్తాడి ప్రసాద్ సత్తా చాటారు. 400,800,1500 మీటర్ల పరుగు పోటీల్లో ద్వితీయ స్థానాల్లో నిలిచి, మూడు వెండి పతకాలను సాధించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాస్టర్స్ అసోసియేషన్ సెక్రటరీ వరప్రసాద్ చేతుల మీదుగా వెండిపతకాలు, సర్టిఫికెట్లు అందుకున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 6,7,8 తేదీల్లో రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి రన్నింగ్ పోటీలకు ప్రసాద్ ఎంపికయ్యారు. జాతీ య పోటీలకు ఎంపికైన ప్రసాద్ మాట్లాడుతూ రాజస్థాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయని,దాతలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

నేడు ప్రాంతీయ రెవెన్యూ సదస్సు

మహారాణిపేట(విశాఖ): ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలతో మంగళవారం ప్రాంతీయ రెవెన్యూ సదస్సు జరగనుంది. కలెక్టరేట్‌లో జరిగే ఈ సదస్సులో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తోపాటు రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారు. పీజీఆర్ఎస్, ఫ్రీ హోల్డ్, నీటి పన్ను, ప్రభుత్వ భూముల సంరక్షణ, గృహ నిర్మాణ స్థలాలు, రీసర్వే, గ్రామ సభలో ప్రస్తావనకు వచ్చిన రెవెన్యూ అంశాలు, సర్వే రాళ్లపై పేర్ల తొలగింపు తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(రెవెన్యూ) ఆర్.పి.సిసోడియా, భూ పరిపాలన విభాగం చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి, భూ పరిపాలన విభాగం అదనపు చీఫ్ కమిషనర్ ఎన్.ప్రభాకర రెడ్డి తదితరులు హాజరవుతారు.

సింహగిరిపై మోగిన నెలగంట



ఆలయ రాజగోపురంలో నెల గంటను మోగిస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, సిబ్బంది

సింహాచలం: ధనుర్మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని సింహగిరిపై నెలగంట ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. నెల రోజులపాటు జరిగే ధనుర్మాస పూజలను పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి తెల్లవారుజామున 3 గంటలకు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. తొలుత సుప్రభాతసేవ, ఆరాధన జరిపారు. అనంతరం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి, గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులు, ఆళ్వారులను ఆస్థాన మండపంలో వేదికపై కొలువుంచారు. ధనుర్మాస ప్రారంభ నివేదనం, తిరుప్పావై సేవాకాలం, ధను సంక్రమణ ప్రవేశ పూజలు చేశారు. అనంతరం గోదాదేవిని పల్లకిలో అధిష్ఠింపజేసి, ఆలయ బేడా మండపంలో తిరువీధిని ఘనంగా నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో తొలి పాశుర విన్నపం చేశారు. ఆ తర్వాత ఆలయ రాజగోపురంలో ఉదయం 6.35కు నెలగంటను శాస్త్రోక్తంగా మోగించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వీడీవీకేల బలోపేతానికి చర్యలు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు: వన్‌ధన్ వికాస్ కేంద్రాల(వీడీవీకే) బలోపేతానికి చర్యలు చేపట్టాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. సోమవారం వెలుగు అధికారులు, ఏపీఎంలతో వన్‌ధన్ వికాస కేంద్రాల నిర్వహణ, వన్‌ధన్ వికాస్ కేంద్రాల సభ్యులకు అందించిన శిక్షణ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్‌ధన్ వికాస్ కేంద్రాల వద్ద రూ.1.52 కోట్లు నిధులు అందుబాటులో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో 106 వీడీవీకేల వద్ద ఈ నిధులు ఉన్నాయని చెప్పారు. వీడీవీకే సభ్యుల శిక్షణకు ఖర్చుచేయగా మిగిలిన నిధులను మూలధన పెట్టుబడిగా వినియోగించాలని సూచించారు. అడుగులపుట్టు వీడీవీకే వద్ద రూ. 2.85లక్షలు, రంగులోయలో రూ.2.85లక్షలు, గుత్తులపుట్టులో రూ. 3.75లక్షలు, వంట్లమామిడిలో రూ.2.81లక్షలు, చినలబుడులో రూ.3.35 లక్షలు, భీమవరంలో రూ.4.51లక్షల నిధులు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. ఇప్పటివరకు శిక్షణకు, యంత్ర పరికరాలకు ఖర్చు చేసిన నిధులకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. 11 మండలాల్లో ఉన్న ఈఎంఆర్ఎస్ పాఠశాలలకు వీడీవీకే ఉత్పత్తులను సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ మురళి, 11 మండలాల ఏరియా కో ఆర్డినేటర్లు, ఏపీఎంలు పాల్గొన్నారు.

టన్నుకు రూ.2 వేలు!



రేషన్ బియ్యం నిఘా అధికారుల స్పెషల్ ట్యాక్స్

రేషన్ బియ్యాన్ని ప్రభుత్వ పెద్దలు గద్దల్లా బొక్కేస్తుంటే.. నిఘా అధికారుల బృందం అదే బాటలో పయనిస్తోంది. అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ బృందం వసూళ్లకు పాల్పడి లోడింగ్‌కు అనుమతులిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. టన్నుకు రూ.2 వేలు చొప్పున తీసుకొని అక్రమ రవాణాకు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. కంటైనర్ టెర్మినల్‌లో ఉన్న అధికార పార్టీ సామాజికవర్గానికి చెందిన వ్యాపారి ఫ్రైట్ స్టేషన్ నుంచి నిత్యం జరుగుతున్న తంతే అయినా.. ఉన్నతాధికారులు మాత్రం తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

- పీడీఎస్ బియ్యంఅక్రమార్కులతో చేతులు కలిపిన అధికారులు
- డబ్బులిస్తే లోడింగ్‌కి అనుమతులు
- ఆ వ్యాపారి కంటైనర్ ఫ్రైట్ స్టేషన్‌కి గుట్టుచప్పుడు కాకుండా తరలింపు

సాక్షి, విశాఖపట్నం: పేదల కోసం అందిస్తున్న పీడీఎస్ బియ్యం విదేశాలకు అక్రమంగా తరలించేస్తున్నారనీ.. వాటిని తాము పట్టుకున్నామంటూ కూటమి ప్రభుత్వం కలరింగ్ ఇస్తోంది. తూతూ మంత్రంగా దాడులు చేసి క్వింటాళ్లలో బియ్యాన్ని పట్టుకొని.. వందల టన్నుల గల బియ్యం కంటైనర్లను మాత్రం హాయిగా పంపించేస్తోంది. పైగా తామే ఈ వ్యవస్థని కాపాడుతున్నామంటూ ప్రభుత్వ పెద్దలంతా బాకాలు కొడుతున్నారు. ఇటీవల విశాఖపట్నంలో పర్యటించి.. 483 టన్నులు బియ్యాన్ని సీజ్ చేసినట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. కానీ.. పక్కనే ఉన్న తమ అనుయాయ వ్యాపారి వేర్ హౌస్‌లపై కన్నెత్తి చూడకుండా అటెన్షన్ మొత్తం.. పోర్టు అనుబంధ విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్(వీసీటీపీఎల్)కి చెందిన కంటైనర్ ఫ్రైట్ స్టేషన్(సీఎఫ్ఎస్)పై ఉండేటట్లుగా చేసేశారు. దీంతో సదరు సామాజికవర్గానికి చెందిన వ్యాపారి సీఎఫ్ఎస్‌ల నుంచి దర్జాగా పీడీఎస్ బియ్యం విదేశాలకు తరలిపోతున్నాయి.



విశాఖలోని కంటైనర్ ఫ్రైట్ స్టేషన్లు

నిఘా బృందమా..? వసూళ్ల బృందమా.?

మంత్రి పర్యటన అనంతరం పోర్టు నుంచి పేదల బియ్యం వెళ్లకుండా నిఘా పటిష్టం చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం సీఎఫ్ఎస్‌లకు వచ్చే కార్గోని తనిఖీ చేసేందుకు అధికారులతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడే అసలు కథ మొదలైంది. బియ్యం పట్టుకోవడం అటుంచితే.. సదరు బృందానికి మాత్రం లాభాలు తెచ్చిపెడుతోంది. 'పౌరసరఫరాల శాఖ అధికారుల బృందం నిరంతరం తనిఖీలు చేసి.. ఇక్కడికి వచ్చిన కార్గోలో పీడీఎస్ బియ్యం ఉంటే.. దాన్ని సీజ్ చేసి.. ప్రభుత్వానికి అప్పగించడంతో పాటు సదరు బియ్యాన్ని తీసుకొచ్చిన ఏజెన్సీపై 6ఏ కేసులు నమోదు చేయాలి.. బియ్యానికి సంబంధించిన పూర్తి డాక్యుమెంట్స్ ఇవ్వాలని గడువు విధించాలి'. కానీ.. ఇవేమీ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది అధికారులు టన్నుకు రూ.2 వేలు చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. వచ్చిన లోడ్‌లో ఎంత మేర పీడీఎస్ బియ్యం ఉన్నాయో గణించి.. దాని ప్రకారం వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. బేరసారాలు కుదిరిన తరువాత ఆ రేషన్ బియ్యానికి రెక్కలొస్తున్నాయి.

కంటైనర్ లోడ్‌కు రూ.50 వేలు.?

మొత్తంగా సీఎఫ్ఎస్ దగ్గరకి వస్తున్న రేషన్ బియ్యం నిఘా అధికారులకు పంట పండిస్తోంది. టీడీపీ సానుభూతిపరుడిగా వ్యవహరిస్తున్న సీఎఫ్ఎస్ యజమానికి చెందిన వేర్ హౌస్‌ల వైపుగా దారి మళ్లిస్తున్నారు. ఇలా వచ్చిన బియ్యాన్ని కంటైనర్లలో లోడ్ చేస్తున్నారు. ఒక్కో కంటైనర్‌కు రూ.50 వేల వరకూ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల చైనాకు వెళ్లిన కార్గో షిప్‌లో 60 కంటైనర్ల పీడీఎస్ బియ్యాన్ని లోడ్ చేశారు. ఈ షిప్ ద్వారా నిఘా అధికారులకు దాదాపు రూ.30 లక్షల వరకు ముట్టినట్లు తెలుస్తోంది. ఇలా.. ఓవైపు ప్రభుత్వం అండతో.. మరోవైపు.. నిఘా అధికారుల సహకారంతో పేదల బియ్యం.. ఓ వ్యాపారి కనుసన్నల్లో దేశాలు తరలిపోతుంటే.. ఉన్నతాధికారులు మాత్రం.. ఒక్క బియ్యం గింజ కూడా బయటకు వెళ్లడం లేదని చెబుతుండటం కొసమెరుపు.


కాఫీ సేకరణ లక్ష్య సాధనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీవో వెంకటేశ్వరరావు

చింతపల్లి: పాడేరు డివిజన్ పరిధిలో కాఫీ పండ్ల సేకరణ లక్ష్యాన్ని సాధించే దిశగా సిబ్బంది కృషి చేయాలని ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు అన్నారు. పల్పింగ్ యూనిట్‌లో డివిజన్ పరిధిలో గల కాఫీ అధికారులు, సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది 2వేల టన్నుల కాఫీ సేకరణ లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. ఇప్పటికి రెండు వందల టన్నులు సేకరించినట్టు తెలిపారు. గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి మాక్స్ సొసైటీకి అమ్మకాలు జరిపే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కాఫీని సేకరించిన 24 గంటల్లోనే రైతు ఖాతాలో సొమ్ము జమ చేయనున్నట్టు చెప్పారు.దళారులకు కాఫీని విక్రయించకుండా రైతులను చైతన్యపరచవలసిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కాఫీ ఏడీ అప్పలనాయుడు, ఉద్యానవన శాఖ అధికారి రూడి అప్పారావు,మాక్స్ సొసైటీ అధ్యక్షుడు సెగ్గె కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పలు విమానాలు ఆలస్యం



గోపాలపట్నం (విశాఖ): పొగమంచు కారణంగా వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో పలు విమానాలు విశాఖ విమానాశ్రయానికి ఆలస్యంగా వచ్చాయి. హైదరాబాద్ నుంచి విశాఖకు ఉదయం 7 గంటలకు రావాల్సిన ఇండిగో విమానం 47 నిమిషాలు ఆలస్యంగా వచ్చింది. చెన్నై నుంచి విశాఖకు ఉదయం 7.45 గంటలకు రావాల్సిన ఇండిగో విమానం ఉదయం 8.27 గంటలకు వచ్చింది. అలాగే బెంగళూరు నుంచి విశాఖకు ఉదయం 7.10 గంటలకు రావాల్సిన ఇండిగో విమానం ఉదయం 9 గంటలకు వచ్చినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.

శివాలయాల్లో విశేష పూజలు

రాజవొమ్మంగి: మార్గశిర మాసం, ఆరుద్ర నక్షత్రం కలసి వచ్చిన రోజు కావడంతో మండలంలోని శివాలయాల్లో సోమవారం శివునికి విశేషపూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే గజగజలాడిస్తున్న చలిని సైతం లెక్కచేయకుండా ఆలయాలకు వెళ్లి అభిషేకాలు నిర్వహించారు. మండల కేంద్రం రాజవొమ్మంగిలో కొండపై గల రాజరాజేశ్వరి సహిత రామలింగేశ్వరస్వామి ఆలయం, జడ్డంగిలోని భ్రమరాంబికామల్లికార్జునస్వామి ఆలయం, స్థానిక షిరిడీసాయిబాబా ఆలయంలో సాంబశివుని ఉపాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు.



పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం(విశాఖ): దక్షిణ మధ్య రైల్వే, గుంతకల్ డివిజన్ పరిధిలో ఆధునికీకరణ పనుల నిమిత్తం నంద్యాల–డోన్–అనంతపురంల మీదుగా నడిచే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ నెల 20న పూరీ–యశ్వంత్‌పూర్(22883) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, 21న యశ్వంత్‌పూర్–పూరీ(22884) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, 25న హౌరా–యశ్వంత్‌పూర్(22831) ఎక్స్‌ప్రెస్, 20న యశ్వంత్‌పూర్–హౌరా(22832) ఎక్స్‌ప్రెస్, 21న భువనేశ్వర్–యశ్వంత్‌పూర్(02811) ఎక్స్‌ప్రెస్, 23న యశ్వంత్‌పూర్–భువనేశ్వర్(02812) ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించిన మార్గంలో వయా నంద్యాల–ఎర్రగుంట్ల–గుత్తి–అనంతపురం స్టేషన్ల మీదుగా నడుస్తాయి.

క్లుప్తంగా

రోగికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్ దురియా పుష్పలత

చింతపల్లి: మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న రోగికి మెరుగైన వైద్యసేవలకు సర్పంచ్ దురియా పుష్పలత ఆర్థిక సాయాన్ని అందించారు. చింతపల్లి కేంద్రంలో పెదపూడి మధుకుమార్తె వర్ధిని అనారోగ్యంతో విశాఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు తమ కుటుంబ విషయాన్ని బంధువులు సర్పంచ్ పుష్పలత దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆమె స్పందించి మెరుగైన వైద్యసేవలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ట్రస్టు సభ్యులు హేమంత్‌కుమార్, శ్రీనివాసరావు, అచ్చిరాజు, శ్రీను పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల సిబ్బందికి క్షమాపణ చెప్పాలి

వై.రామవరం: గ్రామ సచివాలయాల వ్యవస్థ సిబ్బందికి విశాఖకు చెందిన జీవీఎంసీ కార్పొరేటర్ కాకి గోవిందారెడ్డి క్షమాపణ చెప్పాలని మండలంలోని చామగడ్డ సచివాలయ సిబ్బంది డిమాండ్ చేశారు. సోమవారం ఆ సచివాలయంలో సిబ్బంది నిరసన తెలియజేశారు. గోవిందారెడ్డి వ్యాఖ్యలు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే విధంగా ఉన్నాయని, వాటిని భేషరతుగా వెనక్కి తీసుకుని రాష్ట్రంలోని సచివాలయాల సిబ్బంది అందరికి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

గిరిజన రైతు కామరాజుకు సన్మానం



రైతు కామరాజును సన్మానిస్తున్న నిర్వాహకులు

పాడేరురూరల్(అరకులోయరూరల్): విశాఖలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆర్గానిక్ మేళా జరిగింది. మేళాలో గిరిజన ప్రాంతం నుంచి మూడు స్టాల్స్‌ను ఏర్పాటుచేసినట్టు రైతు సాధికార సంస్థ ప్రతినిధి ప్రభాకర్ చెప్పారు. ఇందులో భాగంగా మూడు స్టాల్స్ నిర్వాహకుడు, అరకులోయ చొంపి గ్రామానికి చెందిన గిరిజన రైతు కామరాజు ఉత్తమ మార్కెటింగ్ రైతుగా ఎంపికైనట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర, జిల్లా మార్కెటింగ్ ఎన్ఎఫ్ఏ భాను, సుధాకర్‌ల చేతుల మీదుగా షీల్డ్, ప్రశంసాపత్రాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు.

● ఇదేం 'విజన్' బాబూ!



- అవ్వాతాతల కళ్లల్లో చీకట్లు
- వైఎస్సార్ కంటి వెలుగు పథకానికి కూటమి సర్కారు మంగళం
- విజన్ సెంటర్లు మూసివేత
- కొద్ది నెలల నుంచి నిలిచిపోయిన వైద్యసేవలు

ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేక మసక బారిన చూపుతోనే కాలం వెళ్లదీస్తున్న అవ్వాతాతలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని ప్రవేశ పెట్టింది. అవ్వాతాతలతో పాటు సరైన పోషకాహారం లేక, చిన్నతనంలోనే దృష్టి లోపాలతో బాధపడుతున్న పాఠశాల చిన్నారులకు సైతం ఈ వైఎస్సార్‌కంటి వెలుగు పథకం ఒక వరంగా నిలిచింది. అయితే చంద్రబాబు సర్కారు వచ్చాక వృద్ధులకు ఈ పథకానికి మంగళం పాడింది. కొద్ది నెలలుగా కంటి వైద్య సేవలు నిలిపివేసింది.విజన్ సెంటర్లు సైతం మూసివేసి అవ్వాతాతల కళ్లల్లో చీకట్లు నింపింది.

మసకబారిన కంటి వెలుగు

గత ప్రభుత్వంలో వృద్ధుల కంటి వెలుగు లబ్ధిదారుల సంఖ్య	
గుర్తించిన అర్హులు	2,19,993
వైద్య పరీక్షలు	1,92,152
కళ్లద్దాల పంపిణీ	50,538
కాటరాక్ట్ సర్జరీలు	6747
ఉచితంగా మందుల పంపిణీ	1,34,867

నక్కపల్లి :

నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమానికి 2019 అక్టోబరు10న శ్రీకారం చుట్టారు. మొదటి, రెండు విడతల్లో పాఠశాల విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లోనూ ఎంపిక చేసిన విజన్ సెంటర్లు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో ఆప్తాలమిక్ ఉద్యోగులు అవ్వాతాతలకు కంటిపరీక్షలు నిర్వహించి దృష్టి లోపాలను గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేసేవారు. కళ్లద్దాలను ఉచితంగా అందించేవారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు సైతం ఉచితంగానే చేయించేవారు. ఇక విద్యార్థుల కోసం పాఠశాలలకు నేరుగా వైద్య సిబ్బంది ఆరోగ్య కార్యకర్తలు వచ్చి దృష్టి లోపాలతో బాధపడేవారిని గుర్తించి వైద్యసేవలు అందించేవారు. అయితే చంద్రబాబు సర్కారు ఈ పథకానికి మంగళం పాడింది. విద్యార్థులకు కంటిపరీక్షలు, కళ్లద్దాలు పంపిణీ, శస్త్ర చికిత్సలు అనేది కేంద్రప్రభుత్వ పరిధిలోనిది కాబట్టి, జాతీయ అంధత్వ నివారణ సంస్థ ద్వారా కంటిపరీక్షలు చేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. కానీ అవ్వాతాతలకు మాత్రం ఈ పథకం కింద సేవలు నిలిపివేశారు. దీంతో పండుటాకుల కళ్లలో చీకట్లు అలముకున్నాయి.

నాడు వృద్ధులకు వరంలా...

గత ప్రభుత్వ హయాంలో 2020 ఫిబ్రవరి 18 నుంచి ఫేజ్ 3 పథకం కింద 60 ఏళ్లు నిండిన అవ్వాతాతలపై దృష్టి సారించి విస్తృత రీతిలో కంటి వైద్య సేవలు అందించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కూడా కంటివైద్య శిబిరాలను నిర్వహించారు.

మూతపడ్డ విజన్ సెంటర్లు

గత ప్రభుత్వంలో ఆప్తాలమిక్ అసిస్టెంట్లు గ్రామాల్లో సచివాలయాల్లో అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేసేవారు. ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో ఈ పథకం ద్వారా ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాల ద్వారా వైద్యపరీక్షలు చేసి ఆపరేషన్లు అవసరమైన వారికి ప్రభుత్వ ఖర్చుతోనే పెద్దాసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి ఇంటికి పంపించేవారు. ఇప్పుడా సేవలన్నీ నిలిచిపోయాయి. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌తో ఈ ఏడాది మార్చిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం రాకతో ఈ పథకం పూర్తిగా ఆగిపోయింది. దీనికి సంబంధించిన వెబ్‌సైట్‌ను సైతం మూసేసారు. అవ్వాతాతలకు స్క్రీనింగ్ పరీక్షల కోసం జిల్లాలో కె.కోటపాడు, యలమంచిలి, చోడవరం, నక్కపల్లి ఏరియా ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన విజన్ సెంటర్లను సైతం మూసివేశారు. కంటికి సంబంధించిన సమస్యలతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లే పరీక్షలు, మందులు, కళ్లద్దాల కోసం కనీసం రూ.1500 ఖర్చవుతోంది. ఇక శస్త్రచికిత్సలు రూ.15వేల నుంచి రూ.20 వేలు ఖర్చవుతుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వమే భరించి వృద్ధులకు కంటి వైద్యం చేయించి మసక బారిన చూపు నుంచి కొత్తవెలుగులు ప్రసాదించేది. కూటమి ప్రభుత్వం ఈ సేవలు నిలిపివేయడంతో అవ్వాతాతల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.



అవ్వాతాతలకు కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు (ఫైల్)

జగనన్న ఆరోగ్య సురక్ష కింద కంటి శిబిరాల్లో వైద్య సేవలు పొందిన వృద్ధుల సంఖ్య	
గత ఏడాది సెప్టెంబరులో	ఈ ఏడాది జనవరిలో
వైద్య పరీక్షలు 39364	వైద్య పరీక్షలు : 13,259
కళ్లద్దాల పంపిణీ 23,211	కళ్లద్దాల పంపిణీ : 8,165
కాటరాక్ట్ ఆపరేషన్లు 1031	కాటరాక్ట్ ఆపరేషన్లు : 143



శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారితో వైద్యాధికారులు (ఫైల్)

పథకానికి మార్పులు చేసే అవకాశం



అవ్వాతాతల కోసం గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వైఎస్సార్ కంటి వెలుగు పథకం ప్రస్తుతానికి నిలిపివేశారు. మార్పులు చేర్పులతో కొత్త పథకాన్ని అమలు చేయనున్నట్లు సమాచారం. జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విజన్ సెంటర్లను కూడా మూసివేయడం జరిగింది. అయితే పాఠశాల విద్యార్థులకు మాత్రం ఈ వైద్యపరీక్షలు ,సేవలు యధావిధిగా కొనసాగిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. అవ్వాతాతల కోసం కొత్త పథకాన్ని అమల్లోకి తెస్తే యథావిధిగా సేవలు అందుతాయి.

–డాక్టర్ రమణకుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ

ఆలయాల నిర్మాణాలకు నిధులు విడుదల చేయాలి

జి.మాడుగుల: జిల్లాలో పలు గ్రామాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వాణి ట్రస్టు నిధులతో దేవదాయ ధర్మాదాయ శాఖ సహకారంతో చేపట్టిన ఆలయ నిర్మాణాలకు సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు పలు ఆలయాల కమిటీ అధ్యక్షులు నందోలి కొండబాబు,కొర్రా రాంబుబు తదితరులు తెలిపారు. సోమవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో సుమారు 180 దేవాలయాలు మంజూరు కాగా, ఇందులో కొన్ని దేవాలయాల నిర్మాణాలు పూర్తికావడంతో విగ్రహ ప్రతిష్ఠ జరిగిందని చెప్పారు. మరికొన్ని దేవాలయాల నిర్మాణాలకు టీటీడీ నుంచి మొదటి, రెండవ విడత బిల్లులు చెల్లింపునకు నవంబర్ 5న నిధులు విడుదలయ్యాయని తెలిపారు.దేవదాయ, ధర్మాధాయ శాఖ జిల్లా కార్యాలయం నుంచి ఆలయ కమిటీలకు నిధులు విడుదల కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి తమ గ్రామాల్లో ఆలయాలు నిర్మాణాలు చేపడుతున్నామని, ఇసుక, సిమెంట్ సప్‌లై చేసిన వారు బకాయిలు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు. సంబంధిత ఉన్నాతాధికార్లు తక్షణమే స్పందించి ఆలయాల నిర్మాణాల బిల్లులు విడుదల చేయాలని వారు కోరారు.

పంచాయతీలను కలిపే ప్రధాన రహదారి ఏర్పాటుకు డిమాండ్

- ఆదివాసీ చైతన్యవేదిక సంక్షేమసంఘం జిల్లాఅధ్యక్షుడు లచ్చిరెడ్డి



అల్లూరి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న ఆదివాసీ చైతన్య వేదిక సంఘం నేతలు



దీక్ష చేపడుతున్న ఆదివాసీ చైతన్య వేదిక సంఘం నేతలు

వై.రామవరం: మండల కేంద్రం వై.రామవరం నుంచి మఠంభీమవరం, పోతవరం గ్రామాల మీదుగా అన్ని పంచాయతీలను కలిపి ఎగువప్రాంతానికి ప్రధానరహదారి నిర్మించాలని ఆదివాసీ చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి కోరారు. ఈ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ముందుగా వై.రామవరం జంక్షన్‌లోని అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లచ్చిరెడ్డి మాట్లాడుతూ తాను మాజీ మావోయిస్టు నేతనని, ఒకప్పుడు మావోయిస్టులే రోడ్డు నిర్మాణాలు, పలు అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు పలువురు ఉన్నతాధికారులు ఆరోపించేవారన్నారు. అయితే అటవీ శాఖ అధికారులే అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆయన చెప్పారు. దీనికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వత్తాసు పలుకుతూ గిరిజనాభివృద్ధికి తూట్లు పొడుస్తున్నాయని ఆరోపించారు. ఈరోడ్డు నిర్మాణం పూర్తి చేస్తేనే మండలాభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. సుమారు 25 ఏళ్ల కిందట అటవీశాఖ అడ్డంకులతో ఈరోడ్డు నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయిందన్నారు. అప్పటి నుంచి అడ్డంకులను తొలగించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంలో ప్రభుత్వాలు, ఉన్నతాధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల స్థానికులు సొమ్ము, సమయం ఆదా అవుతాయని చెప్పారు. అధికారుల చుట్టూ తిరిగిఅలసిపోయి, ఈ రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినట్టు తెలిపారు. జిల్లా కార్యదర్శి మడిగొండ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు గుడ్ల త్రిమూర్తులు, ఈక నరసన్నదొర, గుడ్ల ప్రసాదు, పుడిగి లక్ష్మణరావు, గౌతు కాసులు తదితరులు పాల్గొన్నారు

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బెల్ట్ షాపుపై దాడి.. ఒకరి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

సీలేరు: గాలికొండ పంచాయతీ సప్పర్లలో నిర్వహిస్తున్న బెల్టు షాపుపై సోమవారం సిలేరు పోలీసులు దాడి చేసి, మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రవీంద్రనాథ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం మేరకు దాడి చేయగా బెల్ట్‌షాపు నిర్వాహకుడు రామకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి 32 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్



అదుపులోకి తీసుకున్న నిందితులతో పోలీసులు

చింతూరు: రెండు వేర్వేరు ఘటనల్లో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను సోమవారం చింతూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వాహనాల తనిఖీల్లో భాగంగా సీలేరు ప్రాంతం నుంచి తమిళనాడుకు వ్యాన్ అడుగు భాగంలో ఏర్పాటుచేసిన అరలో దాచి ఉంచి రవాణా చేస్తున్న 50 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేయడంతో పాటు ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్లు సీజ్ చేశామన్నారు. మరో ఘటనలో తెలంగాణలోని అశ్వరావుపేటకు చెందిన ఓ వ్యక్తి రెండు కేజీల గంజాయిని తీసుకెళ్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ సీజ్ చేశామన్నారు.

మనస్థాపంతో గిరిజన యువతి ఆత్మహత్య



మృతి చెందిన సంతి

మాకవరపాలెం : కోళ్లఫారంలో పనిచేస్తున్న ఓ గిరిజన యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం బడిమెల గ్రామానికి చెందిన కొల్లూరి సంతి(19) పెదబయలు మండలం లందూరు గ్రామానికి చెందిన కొర్రా చరణ్‌ను ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. పెద్దలకు తెలియకుండా వివాహం చేసుకున్న వీరిద్దరూ లందూరులో నివాసం ఉంటూ 40 రోజుల క్రితం మండలంలోని జంగాపల్లిలోని సూర్యనారాయణ కోళ్లఫారంలో పనికి చేరారు. అయితే సోమవారం కోళ్లకు మేత వేసే విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన సంతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా చరణ్‌కు గతంలో మరో వివాహం జరగ్గా వివాదాల కారణంగా రెండేళ్ల క్రితం విడిపోయారు. ఆత్మహత్య ఘటనపై అందిన సమాచారం మేరకు ఎస్ఐ దామోదర్‌నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బాల్య వివాహాలతో అనర్థం



ఎస్ఐ పాపినాయుడికి ఆహ్వానం పలుకుతున్న సీడీపీవో నీలిమ

దుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఐసీడీఎస్ కిశోరి వికాసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో నీలిమ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. యువతులకు 18 సంవత్సరాలు దాటిన తరువాతే వివాహం చేయాలన్నారు. ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, వైద్యాధికారి రాంబాబు, ఎస్ఐ కె.పాపినాయుడు, ఏటీడబ్ల్యూవో మల్లికార్జున్, ఏపీవో సూరిబాబు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని 16 సచివాలయం పరిధిలోగల ఏడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళ పోలీసు, ఏఎన్ఎం, ఉపాధ్యాయులు, వెలుగు సీసీలతో సుమారు 100 మందికి శిక్షణ కల్పించారు. జీవనాదారాలకు కిశోరి వికాశం సమూహల ద్వారా అభివృద్ధి లక్ష్యంతో సాధికారత సాధించడం జరుగుతుందని సీడీపీవో నీలిమ తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

- ఆ రోజు ఉదయం 5 నుంచి 10.30 వరకే ఉత్తరద్వార దర్శనం
- అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహణ
- వివిధ విభాగాల సమీక్షలో సింహాచలం ఈవో త్రినాథరావు

సింహాచలం: వచ్చేనెల 10న సింహగిరిపై ముక్కోటి ఏకాదశి ఉత్సవాన్ని అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహిస్తామని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అన్నారు. దేవస్థానం పరిపాలనా కార్యాలయంలో సోమవారం దేవస్థానం, పోలీస్, ఆర్టీసీ, వైద్య ఆరోగ్యం, ఫైర్ అధికారులతో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఆ రోజు 45 వేల మందికిపైగా భక్తులు ఉత్తర ద్వార దర్శనానికి వస్తారని, ఆ మేరకు క్యూలైన్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆలయ ఉత్తర రాజగోపురంలో ఉదయం 5 నుంచి 10.30 వరకే ఉత్తరద్వార దర్శనం లభిస్తుందన్నారు. అనంతరం 10.30 నుంచి 11.30 వరకు సింహగిరి మాడ వీధిలో స్వామికి తిరువీధి ఉంటుందన్నారు. రెగ్యులర్‌గా ఉండే ఉచిత దర్శనం, రూ.100, రూ.300 టిక్కెట్లతో పాటు కేవలం ఉత్తరద్వార దర్శనానికి రూ.500 టికెట్ యోచన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు తెల్లవారుజాము 4 నుంచి రాత్రి రద్దీ తగ్గే వరకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. 9వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయన్నారు. 10న నిత్యకల్యాణంతో పాటు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సమీక్షలో గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ గొలగాని అప్పారావు, ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, రాజేంద్రకుమార్, పిల్లా శ్రీనివాసరావు, అడవివరం ఆరోగ్యకేంద్రం డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రామిరెడ్డి, సింహాచలం ఆర్టీసీ డిపో డిప్యూటీ సీటీవో జి.సత్యనారాయణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.ఈశ్వరరావు, సీఐ సరోజనీదేవి, గోపాలపట్నం ఎస్ఐలు అప్పలనాయుడు, రామారావు, ఫైర్ అధికారి కేవీటీ ప్రసాద్ పాల్గొన్నారు.

సిరులతల్లి దర్శనం.. తరించిన భక్తజనం

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 15వ రోజు సోమవారం బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని తరించారు. విశాఖ జిల్లా నలుమూలల నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతా, క్షీరాభిషేకాలు, ప్రత్యేక హోమాలు, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

త్రికాల పంచామృతాభిషేక సేవ

అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొన దలచే భక్తులు రూ.7,500, గురువారం మినహా మిగతా రోజుల్లో రూ.2,500 పూజా రుసుం చెల్లించాలి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081 పేరిట చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్సక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, వాట్సాప్ నంబర్ 89855 15989కు, లేదా మెయిల్ ఐడీ dceoskmlad@gmail.com ద్వారా పంపవచ్చు.

1500 మందికి అన్నదానం

టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం 1500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వేద పండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన కారు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. సీఐ ఎ. స్వామినాయుడు అందించిన వివరాల ప్రకారం... విజయవాడ నుంచి విజయనగరం వెళుతున్న కారు తాళ్లపాలెం వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో చెన్నైకు చెందిన కారు డ్రైవర్ సత్యమూర్తి (44) తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని అనకాపల్లి ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న ఇషాక్, హుస్సేన్‌లకు గాయాలయ్యాయి. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. వ్యాపార రీత్యా విజయనగరం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.